క్లుప్తంగా

మండపేటలో పోలీసు కవాతు



మండపేటలో కవాతు చేస్తున్న పోలీసులు

మండపేట: పట్టణంలో బుధవారం పోలీసులు కవాతు నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి వివాదాలకు ప్రజలు పాల్పడవద్దని, చట్ట పరిధిని మీరితే చర్యలు తప్పవని కవాతు లక్ష్యాన్ని వివరిస్తూ ఎస్సై హరికోటి శాస్త్రి అన్నారు.

ఏపీఆర్జేసీలో అముజూరు విద్యార్థి ప్రతిభ



ఏపీఆర్జేసీలో సీటు సాధించిన పెంకే జితేంద్ర

కె.గంగవరం: మండలంలోని అముజూరు మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థి పెంకే జితేంద్ర ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజెస్ ఎంట్రన్స్‌లో ప్రతిభ కనబరచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చొల్లంగి శ్రీను బుధవారం విలేకరులకు తెలిపారు. విద్యార్థికి భూపతిపాలెం ఏపీ రెసిడెన్షియల్ స్కూల్‌లో సీటు వచ్చిందన్నారు. విద్యార్థిని మండల విద్యాశాఖాధికారులు ఎ.నాగరాజు, సీహెచ్ ఆంజనేయులు, ఉపాధ్యాయుడు డమరుక నాథం, గ్రామ సర్పంచ్ నానాపరపు కల్యాణి, శ్రీనివాస్ దంపతులు, వైస్ ఎంపీపీ నీతిపూడి మధుబాల, కొండ దంపతులు, పెంకే రవిచంద్ర, మేడిశెట్టి శ్రీనివాస్, గ్రామస్తులు అభినందించారు.

కళాకారుని కుటుంబానికి ఆర్థిక సాయం



మందపల్లిలో మృతుడి భార్యకు ఆర్థిక సాయం అందజేస్తున్న ప్రసాద్ తదితరులు

కొత్తపేట: కళాస్రవంతి సంగీత, వాయిద్య, నృత్య కళాకారుల సంక్షేమ సంఘం సమావేశం బుధవారం మండలంలోని పలివెల కళా భవనంలో జరిగింది. సంఘ అధ్యక్షుడు కొమారిపాటి ఏసువెంకటప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కళాకారులకు గుర్తింపు కార్డులు, ఇళ్ల నిర్మాణం తదితర అంశాలపై చర్చించారు. త్వరలో ఏర్పడే నూతన ప్రభుత్వం దృష్టికి ఈ అంశాలనే తీసుకువెళ్లి సాధించుకోవాలని తీర్మానించారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సెట్టిపేట చిన్న (36) అనే కళాకారుడు కుటుంబానికి సంఘం తరపున రూ.10 వేల సాయం అందించాలని తీర్మానించారు. ఆమేరకు మందపల్లి గ్రామం వెళ్లి మృతుడు చిన్న భార్య సత్యవతికి పై ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు, కళాకారులు పాల్గొన్నారు.


నాగేంద్ర స్వామి కల్యాణం



పుల్లేటికుర్రులో నాగేంద్ర స్వామి పుట్ట

అంబాజీపేట: పుల్లేటికుర్రు యూనియన్ బ్యాంక్ పక్కన పంట కాలువ రోడ్డులో వేంచేసియున్న శ్రీ నాగేంద్ర స్వామి వారి పుట్ట కల్యాణ మహోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. పాణింగపల్లి నాగ వెంకట మురళీ ప్రకాశ్–శైలజ దంపతుల ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణం జరిపించారు. పూర్వం నుండి ఏటా ఈ పుట్ట వద్ద నాగులచవితికి విశేష పూజలు నిర్వహిస్తారు. స్వామి కల్యాణాన్ని పురస్కరించుకుని అన్న సమారాధన చేపట్టారు.

నిత్యాన్నదానానికి రూ.10 వేల విరాళం



దాత కుటుంబానికి స్వామి చిత్రపటం అందిస్తున్న ఆలయ ఉద్యోగులు

మామిడికుదురు: అప్పనపల్లి బాల బాలాజీ స్వామి వారి నిత్యాన్నదాన ట్రస్టుకు బుధవారం అదే గ్రామానికి చెందిన ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుడు గూటం శ్రీనివాస్‌రావు, నాగలక్ష్మిభారతి దంపతులు రూ.10,116 విరాళంగా అందించారు. ఈ విరాళాన్ని దాత కుటుంబం ఆలయ అధికారులకు అందజేశారు. విరాళం అందించిన దాతలకు ఆలయ ఉద్యోగులు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

ఎన్నెన్నో వర్ణాలు.. అన్నింటా అందాలు



ప్రకృతికి నూతన శోభ అద్దుతున్న పెల్టో ఫాం ఎల్లో..



ఆకట్టుకుంటున్న లాగర్‌స్ట్రోమియా సోయగాలు



రేల పూలు.. ప్రకృతి ప్రేమికుల నయనాలకు అందాల సిరులు



ఎర్రని ఎండకు పోటీగా గుల్‌మొహర్ అందాలు



మదిని దోచే ఫ్లేమ్ ఆఫ్ ఫారెస్ట్ (మోదుగ)

మండు వేసవిలో చెట్టు నీడ ఎంతో హాయినిస్తుంది. కొన్ని రకాల తరువులు నీడ నివ్వడంతో పాటు ప్రకృతి ప్రేమికులకు, ప్రయాణికులకు సేద తీర్చడమే కాదు..ఆహ్లాదాన్ని కూడా పంచుతున్నాయి. రహదారుల వెంబడి రోడ్డు పక్కన నాటిన చెట్లు విభిన్న పూలతో ఆకట్టుకుంటున్నాయి. ఓ వైపు ఎండ వేడిమితో సతమతమవుతున్న వాహన చోదకులకు ఈ పూల చెట్లు ఆనందాన్ని ఇస్తున్నాయి. వసంత రుతువులో లేలేత చిగుళ్లను తొడిగిన తరువులు.. దట్టంగా అలముకున్న ఆకులతో పాటు రంగు రంగుల పూలతో ప్రకృతికి నూతన శోభను తీసుకు వస్తున్నాయి. తురాయి, రేల తదితర పూల చెట్లు ప్రకృతి ప్రేమికులకు కను విందు చేస్తున్నాయి. – రాయవరం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామచంద్రపురం: పట్టణంలోని 33/11 కేవీ సబ్ స్టేషన్, పట్టణ పరిధిలోని 11 కేవీ సబ్ స్టేషన్ 2 ఫీడర్, 11కేవీ టౌన్–1, ఫీడర్, 11 కేవీ 3 ఫీడర్, చెల్లూరు ఫీడర్, ఓదూరు ఫీడర్‌లు అత్యవసర మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు రామచంద్రపురం డివిజన్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.విజయానంద్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేడు ఉదయం 9 గంటల నుంచి 11.30 వరకు మెయిన్ రోడ్డు, రత్నంపేట, కమ్మవారిసావరం, హౌసింగ్ బోర్డు, ముచ్చుమిల్లి, లలితా నగర్, కవలవారి సావరం, ముచ్చిమిల్లి రోడ్డు, ఆర్డీవో కార్యాలయం, ముచ్చుమిల్లి మధ్యకొంపలు, ఏరియా ఆసుపత్రి, మోడరన్ కాలేజ్, రామకృష్ణ సెంటర్ బ్రాడీపేట, మార్కెట్ సెంటర్, గాంధీ హాస్పిటల్, స్టేట్ బ్యాంకు, కోర్టుల ప్రాంగణం, జూనియర్ కాలేజీ, నరసరావుపేట అక్వా చెరువులు, నూకల మిల్లు, విజయ ఫంక్షన్ హాల్, శ్రీనివాస రైస్ మిల్లు, కాకినాడ రోడ్డు అంకంవారివీధి, గుబ్బల వారిపేట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కాటన్ సేవలు చిరస్మరణీయం

- వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు త్రినాథరెడ్డి
- పసలపూడి లాకుల వద్ద అపర భగీరథుడి జయంతి

రాయవరం: ఉభయ గోదావరి జిల్లాలకు సాగు, తాగునీటికి రూపకర్త కాటన్ దొర సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొవ్వూరి త్రినాథరెడ్డి పేర్కొన్నారు. అపర భగీరథుడిగా ఖ్యాతి గాంచిన సర్ ఆర్థర్ కాటన్ జయంతిని బుధవారం మండలంలోని పసలపూడి లాకుల వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా త్రినాథరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయం సస్య శ్యామలం చేసేందుకు కాటన్ దొర ప్రాజెక్టులు నిర్మించారన్నారు. విదేశీయుడైనప్పటికీ కాటన్ తెలుగు రాష్ట్రాల్లో నిర్మించిన ఆనకట్టల ద్వారా భవిష్యత్తు తరాలకు అపర భగీరథుడిగా ఈ ప్రాంత ప్రజలకు నిత్య చిరస్మరణీయుడిగా నిలిచారన్నారు. కాటన్ మహాశయుడు ప్రతీ తెలుగు రైతు గుండెల్లో గూడు కట్టుకున్నాడన్నారు. కాటన్ ముందు చూపును అందిపుచ్చుకున్న ఘనత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డికి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. తొలుతగా కాటన్ విగ్రహానికి త్రినాథరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు నల్లమిల్లి మంగతాయారు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సత్తి వెంకటరెడ్డి, ఆ పార్టీ బూత్ కమిటీ మండల కన్వీనర్ చింతా సుబ్బారెడ్డి, పార్టీ నాయకులు నల్లమిల్లి వెంకటరెడ్డి, డీఆర్‌సీ రెడ్డి, వెంకటరెడ్డి, అనిల్‌రెడ్డి, రైతులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో కాటన్ జయంతిని ఘనంగా నిర్వహించారు.



పసలపూడి లాకుల వద్ద కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న త్రినాథరెడ్డి తదితరులు

కాటన్ మహనీయుడి కృషి అజరామరం

కపిలేశ్వరపురం: కాటన్ మహనీయుడి కృషి అజరామరమని ఆయన జయంతి కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. మండలంలోని తాతపూడి, వల్లూరు, అంగర, కపిలేశ్వరపురం తదితర గ్రామాల్లోని కాటన్ విగ్రహాలు వద్ద బుధవారం నివాళి అర్పించారు. పలు ప్రజా సంఘాలు నేతలు మాట్లాడుతూ ధవళేశ్వరం బ్యారేజి నిర్మాణం కారణంగా గోదావరి తీర ప్రాంతాలు సస్యశ్యామలం అయ్యాయన్నారు.

మండపేటలో...

కాటన్ సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు అన్నారు. మండలంలోని కేశవరంలో నిర్వహించిన కాటన్ జయంతి కార్యక్రమంలో వెంకన్నబాబు మాట్లాడుతూ ఆధునిక సమాజంలో అన్నం తినగలుగుతున్నామంటే బ్రిటిషు పాలనా కాలంలో కాటన్ మహనీయుడు నిర్మించిన బ్యారేజ్ కారణమన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు అన్నందేవుల కృష్ణ, మండల సాగు సలహా మండలి చైర్మన్ అన్నందేవుల చంద్రరావు, పీఏసీఎస్ చైర్మన్ ముక్కపాటి శ్రీనివాస్, నాయకులు సలాది శివ, కూసు బాలశ్రీనివాస్, అమ్మన్న, తుపాకుల ప్రసన్నకుమార్, రాయపాటి సత్యనారాయణ, అబ్బిరెడ్డి వీర్రాజు పాల్గొన్నారు.



అన్నాయిపేటలో కాటన్ దొరకు నివాళి అర్పించిన సర్పంచ్ దొరబాబు, వైస్ ఎంపీపీ శాకా బాబీ తదితరులు

కాటన్‌దొరకు ఘన నివాళి

రామచంద్రపురం రూరల్: గోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేసిన సర్ ఆర్థర్ కాటన్ జయంతిని పురస్కరించుకుని మండలంలోని అన్నాయిపేటలో సర్పంచ్ పెమ్మిరెడ్డి దొరబాబు, వైస్ ఎంపీపీ శాకా చంద్రశేఖరసూర్యప్రకాశ్(బాబీ)ల ఆధ్వర్యంలో ఘనంగా నివాళి అర్పించారు. పంచాయతీ ఆవరణలోని కాటన్ దొర విగ్రహానికి పూలమాలలు వేశారు. సర్పంచ్ దొరబాబు మాట్లాడుతూ అనావృష్టి, కరువులతో ప్రజలు పడే ఇబ్బందులు చూసి ధవళేశ్వరం వద్ద ఆనకట్టను నిర్మించారన్నారు. క్షామపీడిత గోదావరి డెల్టాను సస్యశ్యామలం చేసి గోదావరి జిల్లాల ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చల్లా బుజ్జి, వార్డు సభ్యుడు తోట శ్రీను, పెద్దలు రావూరి సుబ్బారావు, మాజీ ఉప సర్పంచ్ కాకిలేటి సత్యనారాయణ, పిల్లా సూరిబాబు, పాట్టిపోతుల వెంకన్నబాబు, ఆకుల కొండబాబు తదితరులు పాల్గొన్నారు.



కేశవరంలో కాటన్‌కు నివాళి అర్పిస్తున్న వెంకన్నబాబు తదితరులు

సంక్షేమ పాలనకే పట్టం

మామిడికుదురు: అభివృద్ధి, సంక్షేమ ప్రదాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా నిలిచారని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ పేర్కొన్నారు. జిల్లా రైతు విభాగం కార్యదర్శి చేట్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈదరాడలో బుధవారం జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ పాల్గొన్నారు. సంక్షేమ పాలనకు ప్రజలు పట్టం కట్టారని చెప్పారు. అందరి సంక్షేమ కోరుకున్న జగన్ రెండో సారి సీఎం కావాలని ప్రజలు ఆశీర్వదించారని చెప్పారు. భారీగా జరిగిన పోలింగ్ దానికి నిదర్శనమన్నారు. ఎమ్మెల్సీ పుట్టిన రోజును పురస్కరించుకుని స్థానికులు ఏర్పాటు చేసిన కేక్ కోశారు. క్రీడాకారులకు క్రికెట్ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కుసుమ వనజకుమారి, సర్పంచ్ చుట్టుగుళ్ల లక్ష్మి, ఎంపీటీసీ బయ్యా సునీత, పార్టీ నాయకులు యెరుబండి సూరిబాబు, వడ్డే ఆదిబాబు, మద్దుల వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అలాగే పి.గన్నవరంలోనూ ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ బర్త్‌డే వేడుకలు నిర్వహించారు.



ఈదరాడలో క్రీడాకారులకు క్రికెట్ బ్యాట్ అందజేస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

చింతలూరులో హుండీల చోరీ



చింతలూరులోని గోశాల వద్ద హుండీని ధ్వంసం చేసిన దుండగులు

ఆలమూరు: మండలంలోని చింతలూరులో హుండీల చోరీ జరిగింది. గ్రామంలోని తూర్పు వీధి రామాయలం వద్ద, గోపరం ధామం గోశాల వద్ద ఏర్పాటు చేసిన హుండీలను గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం తెల్లవారుజామున ధ్వంసం చేశారు. స్థానికుల కథనం ప్రకారం తూర్పు వీధి రామాలయంలోని హుండీని అపహరించుకుపోయారు. పక్కనే ఉన్న గోశాలలోని హుండీని పగుల గొట్టి అందులో ఉన్న నగదును తస్కరించారు. హుండీని మాత్రం ఆ ప్రదేశంలోనే ఉంచి పారిపోయారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఈమేరకు ఆలమూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చిన్నారులకు టీకాలు

ఆలమూరు: చిన్నారులకు నిర్ణీత సమయంలో విధిగా టీకాలు వేయించాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి అన్నారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలోని సబ్ సెంటర్లతో పాటు ఆలమూరు ప్రభుత్వ ఆస్పత్రిలో హెల్త్ సిబ్బంది బుధవారం చిన్నారులకు టీకాలను అందజేశారు. వైద్యాధికారులు ఆధ్వర్యంలో ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి వైద్యసేవలను పర్యవేక్షించారు. పెదపళ్ల, చింతలూరు, కలవచర్ల, చొప్పెల్ల, చెముడులంక, మడికి, గుమ్మిలేరు, నర్సిపూడి గ్రామాల్లో చిన్నారులకు టీకాలు, బాలింతలకు, గర్భిణులకు ఇంజక్షన్లు అందజేశారు. ధనుర్వాతం, కామెర్లు, క్షయ, పోలియో, డిఫ్తీరియా, కోరింత దగ్గు నివారణకు టీటీ, డీపీటీ, మీజిల్స్, పెంటావాలెంట్, ఎంఆర్, హెపటైటిస్–బీ వ్యాక్సిన్లను అందజేశారు. బాలింతలకు, గర్భిణులకు బలవర్ధక ఔషధాలను, యాంటి బయాటిక్ మందులను అందజేశారు. హెల్త్, అంగన్‌వాడీ, ఆశ సిబ్బంది పాల్గొన్నారు.



కలవచర్లలో చిన్నారులకు టీకాలు అందజేస్తున్న ఆరోగ్య సిబ్బంది

ముందస్తుగా ఎండు గడ్డి సేకరణ



మొసలపల్లి యంత్ర సాయంతో సిద్ధమైన ఎండు గడ్డి బేళ్లు

అంబాజీపేట: వరద ప్రభావిత ప్రాంతాల్లోను, రానున్న వర్షాకాలంలో పశుపోషణకు గడ్డి కొరత లేకుండా ముందస్తుగా రైతులు ఎండు గడ్డి సేకరిస్తున్నారు. అయితే గతంలో మెషీన్‌తో గాని, కూలీలతో గాని వరి కోతలు కోసేవారు. ఎండు గడ్డిని మేటులు వేసి భద్రపరుచుకునే వారు. వాతావరణంలో మార్పుల కారణం ఒకటైతే ప్రస్తుత కాలంలో కూలీల కొరత ఎక్కువగా ఉండటంతో మెషీన్‌తో కోసిన గడ్డిని యంత్ర సాయంతో 35 కేజీల బేళ్లుగా తయారు చేసి మేట్‌లు వేస్తున్నారు. అదే గడ్డిమేటు వేయాలంటే ప్రస్తుతం ఎకరానికి గడ్డి రూ.4 వేలు, మేటు వేయడానికి రూ.4 వేలు ఖర్చవుతున్నాయని అదే బేళ్లు రూపంలో మేట్‌లు వేయడం వల్ల ఖర్చులు ఆదా అవుతున్నాయని రైతులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా వరద ప్రభావిత ప్రాంతాల్లో పశువులకు ఎండుగడ్డి కొరత లేకుండా బేళ్లను సిద్ధం చేసి ఆయా గ్రామాల్లో ఉన్న ఆర్బీకేల్లో భద్రపరుస్తున్నామని అధికారులు చెబుతున్నారు. ఒక పక్క ధాన్యం రాశులను సంరక్షించుకుంటూ, పశువులకు ఎండు గడ్డిని ఒడ్డుకు చేర్చుకుంటున్నారు రైతన్నలు.

45 మంది రక్తదానం

మామిడికుదురు: బ్రైట్ స్పోన్స్ పర్యవేక్షణలో బుద్దాల నాగరత్నం మెమోరియల్ వాలంటరీ బ్లడ్ సెంటర్, సహస్ర బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో బుధవారం మొగలికుదురులోని శ్రీసత్యసాయి కల్యాణ మంటపంలో ఉచిత మెగా రక్తదాన శిబిరం జరిగింది. ఈ శిబిరంలో పలువురు యువకులు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. సుమారు 45 మంది రక్తదానం చేశారని నిర్వాహకులు తెలిపారు. దీంతో పాటు ఉచితంగా బ్లడ్ గ్రూప్ నిర్ధారణ, హిమోగ్లోబిన్ పరీక్షలు చేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ ఆపద సమయంలో రక్తం కోసం ఎంతో మంది ఎదురు చూస్తూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. రక్తదానం కార్యక్రమంలో యువకులు ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కడి శ్రీను, యక్కల మోహర్, మానెం కమలేశ్వరరావు, నిర్వాహకులు బిళ్ల తేజ, బిళ్ల గణేష్, ఊటుకూరి మాణిక్యనాగబాబు, చెల్లింగి కృష్ణ, కొండా చినబాబి, గుంటు మోహన్‌ఈశ్వరరావు పాల్గొన్నారు.



మొగలికుదురులో రక్తదానం చేస్తున్న యువకులు

కిడ్నీ వ్యాధిగ్రస్తునికి చేయూత

అయినవిల్లి: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న మండలంలోని మాగం గ్రామానికి చెందిన అంబటి నరసింహమూర్తికి సూరపరెడ్డి సురేష్ బుధవారం చేయూత నందించారు. నరసింహమూర్తి కష్టాలు తెలుసుకున్న ఉప్పలగుప్తం మండలానికి చెందిన సురేష్ ఆధ్వర్యంలో గారపాటి రిషిబాబు, రవి సత్యనారాయణ, నాగదుర్గలు బాబి మాస్టర్ చేతుల మీదుగా నెల రోజులకు సరిపడా నిత్యావసరాలను అందజేశారు. వీరిని వివేకానంద సేవా సమితి సభ్యులు అభినందించారు.

సీనియర్ అసిస్టెంట్ బాబులు మృతికి సంతాపం

సఖినేటిపల్లి: సుదీర్ఘ కాలం అంతర్వేది దేవస్థానం వీఆర్వోగా పనిచేసిన పూర్వ బీజేపీ నాయకుడు, ప్రస్తుతం మలికిపురం తహసీల్దార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న పోతురాజు వెంకట నరసింహ కుమార్(బాబులు)ఆకస్మిక మృతికి మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. బుధవారం అంతర్వేదికరలో బాబులు కుటుంబ సభ్యులను వేమా పరామర్శించారు. వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.